# వైకుంఠపాళి

ఆ వేళ ఆదివారం. నిద్రమంచంమీదనుంచి లేచీలేవగానే కృష్ణకి ఆ వేళ ఆదివారమని జ్ఞాపకంవచ్చి, వెయ్యిరూపాయలు లాటరీలో గెలిచినంత సంతోషపడ్డాడు. వారమంతా ఉద్యోగబాధ్యతలతో, తడుపడి లాటి మేనేజరుతో దినదినగండంగా ఉన్న తనకు ఆదివారం పండగరోజుకంటే విలువైనదిగా అనిపిస్తుంది. గోడమీద ప్రాభాత మందపవనాలకు టపటపలాడే కాలెండర్ కాగితాలమీద అతనిదృష్టి నిలిచింది. ఆ వేళ వైకుంఠ ఏకాదశి అనే మరొక విస్మృత విశేషం జ్ఞాపకం రావడంతో కృష్ణ ఎగిరి గంతేశాడు. అతని గంతుతో ప్రక్కనే ఉన్న టేబిల్ మీదనుంచి బెడ్ రూంలాంప్ క్రిందపడింది. ఆ చప్పుడు విని లోపల శారద ఈ విషయానికి నాయకుడు కృష్ణ అనీ, అతను నిద్రనుంచి లేచాడనీ తెలుసుకోడానికి అట్టేసేపు పట్టలేదు. ఇలాటి చిన్న చిన్న సంఘటనలు ఆమెకు అతనితో పెళ్ళి అయిన యీ యేడాదిలోగా చాలానే జరిగాయి.

లోపలికి వచ్చేసరికి కృష్ణ ధ్యానముద్రలో ఉన్నాడు. శారద అధరంమీద చిరునవ్వు లాస్యంచేసింది. ప్రతి ఆదివారం నిద్రనుంచి కృష్ణ లేవగానే, ఆరోజంతా ఎలాగ గడపాలి? అనే తీవ్ర సమస్యతో ధ్యానసమాధిలో ఉండడం శారద అనుభవంలోకి రాని క్రొత్తసంఘటన కాదు.

గోడమీద కొట్టుకుంటున్న కాలెండర్ చూస్తూ, శారద మెల్లగా అంది: "ఇవాళ వైకుంఠ ఏకాదశి."

స్వర్గంలో దూరంనుంచి మధురంగా వినవచ్చే అప్సరస సంగీతస్వరంవంటి ఆమె కంఠస్వరంతో ఒక ఋషి తపస్సుకు విఘ్నం కలిగినట్టయింది.

ఈ గొంతునీ, ఈ రూపాన్నీ ఇంతకాలంనుంచి వింటున్నా, చూస్తున్నా అతనికి ఆమెలో ఏదో నూత్న సౌందర్యం, క్రొత్త ఆకర్షణ కనిపిస్తూనే ఉంటాయి. ఆమె కదలుతున్నప్పుడూ, ఎర్రని పెదవులు విప్పి, అందమైన పలువరుస కనిపించేటట్టు సన్నని సంగీతస్వరంతో మాట్లాడుతున్నప్పుడూ అతను ఆమెను నిశ్చలంగా ఒక మూగప్రతిమలాగ చూస్తూ కూర్చోవడం ఒక మధురమైన అనుభూతి. చిత్రకారుడి కళాజగత్తులోని ముగ్ధస్వరూపానికి హఠాత్తుగా ప్రాణంవచ్చి అతనితో మాట్లాడుతున్నట్టు, సంచరిస్తున్నట్లు అనిపిస్తుంటుంది.

"ఇవాళ రాత్రంతా జాగరం చెయ్యాలి. మరి నాకు రాత్రి పొద్దుపోయాక నిద్ర ఆగదు" అంది శారద చిరునవ్వుతో; అతను మత్తుగా చూస్తున్న నిమీలిత నయనాలలోకి చూస్తూ.

ఆ ప్రశ్నతో కృష్ణకు అసలు కర్తవ్యం జ్ఞాపకం వచ్చింది. మళ్ళీ ఆలోచించసాగాడు. ఆలోచన తెగక, పరాజయాన్ని అంగీకరిస్తున్నట్లు:

"అదే నాకూ తోచడంలేదు శారూ. నీకేమైనా మంచి ఆలోచన తట్టితే చెబుదూ" అన్నాడు బతిమాలుతూ.

శారద విజయసూచకంగా ఆసనాన్ని స్వీకరించింది.

## ప. గోపీచంద్

"వినోదానికి వినోదం, పుణ్యానికి పుణ్యం రెండూ ఒక్కదెబ్బతో రావాలి" అంది షరతు పెడుతున్నట్టు.

కృష్ణ అసంతృప్తిగా మొహం పెట్టాడు.

"ఉపవాసాలూ, జాగరాలూ చేసినంత మాత్రాన్ని పుణ్యం ఆకాశమంత ఎత్తున పెరిగిపోతుందని నాకు నమ్మకంలేదు శారూ. నాకు కావలసింది వినోదమే. మరి నీకు పుణ్యం కావాలంటే నీ యిష్టం" అన్నాడు.

"చదువుకున్న వాళ్ళంతా నాస్తికులు కాబూ. వాళ్ళతో ఏమీ మాట్లాడలేం" అని మూడో వ్యక్తికి ఫిర్యాదు చేసినట్లు స్వగతం చెప్పుకుని లేచిపోబోయింది. ఈ మాట ఆమె అంటుందని కృష్ణకు తెలుసు. అందుకే తీరా అనేశాక నాలిక కరుచుకున్నాడు. ఆమె వెళిపోతే తన మధురానుభూతికి విఘ్నం కలుగుతుందని ఊహించి ఆమె జడపట్టుకొని లాగి, లొంగిపోయిన స్వరంతో అన్నాడు:

"సరే నీ యిష్టంలే శారూ" అని.

విజయగర్వంగా శారద భర్తవైపు చూసి నవ్వింది.

"అలాగైతే చీటీలు లాటరీ వేద్దాం" అంది.

కృష్ణకి ఇంతటి అయఃపిండం లాటి సమస్య శారదచేతిలో మైనం ముద్దలాగ కరిగిపోయేసరికి తన తెలివి తేటలమీద నమ్మకం పోయింది. శారదపెటిన షరతులకు బుద్ధిగా ఒప్పుకుని, కాగితం ముక్కలమీద తనకు స్ఫురించినవి వ్రాసి సిద్ధంగా కూర్చున్నాడు. శారద వ్రాస్తూంది. ఆమె వ్రాస్తున్న వేవో చూడాలని ప్రయత్నించాడు. ఆమె జాగ్రత్త పడింది. మధ్యమధ్య నవ్వుకుంటూ ఒక్కొక్క చీటీమీదా ఆమె వ్రాస్తున్న దేదో తెలుసుకోవాలని కృష్ణకి చాలా కుతూహలంగా ఉంది. ఆమె చేతికదలికల పసిగట్టాలనిచేసిన ప్రయత్నంకూడా వృథా అయింది

లాటరీ వేశారు. కృష్ణకి మూడుసార్లూ ఒక్కలాగే వచ్చింది. శారదకి మొదటిసారి సినిమా, రెండోసారి భోజనాలు కాగానే హాయిగా నిద్రపోవాలని, మూడోసారి తెల్లవారు ఝామువరకూ రాత్రి ఉపవాసంచేసి భజనచేస్తూ కూర్చోవాలనీ వచ్చాయి. కృష్ణకి చివరిదానితో చిరుకోపం రావడంచూసి, శారద కొంటెగా నవ్వుకుంది. కృష్ణ భజనలూ, పూజలూ అంటే 'వీర'ద్వేషి అని ఆమెకు తెలుసు.

"నాకు మూడుసార్లూ ఒక్కలాగే వచ్చింది కనక నేనే గెలిచాను" అన్నాడు అతను. మొదట శారద ఒప్పుకోలేదు. కాని చీటి విప్పిచూశాక ఒప్పుకుంది. ఈ ఆటలో జయం తనదే అని ఏదో ఒక శాశ్వత అధికారం తనకు ఉన్నట్లు ఆమె ఎప్పుడో నిశ్చయం చేసుకుంది.

చీటివిప్పి శారద చూసింది: "వైకుంఠపాళి."

* * *

సాయంత్రం తిరిగి తిరిగి విసుగ్గా ఇంటికి వచ్చేసరికి శారద మంచి హుషారుగా ఉంది. రాత్రి రాబోయే పందెంలో ముందే విజయాన్ని ఆమె నిర్ధారించేసుకున్నట్టు అతను అనుకున్నాడు. తెల్లని చీర ఆమె పచ్చని శరీరకాంతిలో కలిసి పోయినందున అలంకారాలను అన్వేషిస్తూ,-కవిత్వాన్ని చెప్పలేక ఉక్కిరిబిక్కిరయే అసమర్థ కవివలె అవస్థలో ఉన్నాడు. ఆమె వినీల వేణిలోని మల్లె పువ్వులు యౌవనాగమనంతో రేకులన్నీ విరుచుకొని


యౌవనోన్మత్త మత్తకాశినిలాగ అకారణ దరహాసాన్ని వలకబోస్తున్నాయి. ఆమె కావ్యాలలోని జ్యోత్స్నాభిసారిక అనుకున్నాడు అతను. అతని నిశిత పరిశీలనా దృక్కులకు ఆమె అధరంమీద మధురహాసం వెలసింది.

అప్రయత్నంగా, కృష్ణ "శారద! నీరదేందు ఘనసార తుషార మరాళ మల్లికా హార" అనే పద్యాన్ని రాగంతో చదివాడు.

ఆమె అందంగా, ఒయ్యారంగా రాజహంసగమనంతో లోపలికి వెళ్ళిపోయింది.

కాఫీ తాగి కార్యక్రమాన్ని నెమరు వేసుకుంటున్నాడు కృష్ణ. శారద రేడియో రికార్డులతో శ్రుతికలిపి పాడుతోంది. దూరంగా సాయంత్రం గాలికెరటాలతో కరిగి మెల్లమెల్లగా వినిపించే గుడిగంట నాదం, వేసవికాలపు సాయంత్రం ప్రియురాలి కబరీభరంలోని మల్లికా సుమాల పరిమళ లహరితో బరువుగా మత్తెక్కించే మందమారుతం, శారద శరీరంనుంచి అప్పుడప్పుడు ప్రవాహ తరంగాలుగా గాలిలో కలిగే పచ్చకర్పూరం, కస్తూరి సువాసనలు అతనిలోని కళాపిపాసను ఎక్కువచేశాయి. దాంపత్యంలోని అనురాగం వెల్లివిరిసే గొంతుతో ఆమెను పిలిచాడు పనిలేకపోయినా, అనుకోకుండా. నిజానికి అతని మనస్సు చాలా అశాంతిగా ఉంది. కాని ఆమెసన్నిధిలో తన అశాంతిని మరచిపోగలడు. తర్కానికి లొంగనికారణం; ఆమె శశ్యమూర్తి. ఆ వేళ మూర్తి ఒకదుర్వార్త చేరేశాడు తనకి. తన ఉద్యోగానికి తక్షక రామారావుగారు తెచ్చిపెట్టబోయే ప్రమాదాన్ని గురించి మూర్తి తనకు చెబుతున్నప్పుడు మొదట భయంగాని ఆశ్చర్యంగాని కలగలేదు. కాని పామువిషం అతన్ని క్రమంగా బాధపెట్టినట్లు ఈ తక్షకుడు తనమీద వెళ్ళగక్కిన విషం అతన్ని క్రమంగా బాధించింది.

'తక్షక' రామారావుగారు కృష్ణ పనిచేస్తున్న కంపెనీ మేనేజరు. కృష్ణ పనిలో చేరడానికి మునుపు; ఆయన తన బావమరిదికి (రాజస్యాలకుడు) ఆ ఉద్యోగాన్ని ఇప్పించాలని చాలా ప్రయత్నంచేశాడు. కాని కృష్ణ తనకు న్యాయంగా రావలసిన హక్కులకోసం కోర్టుదాకా వెళ్ళి ఈ ఉద్యోగాన్ని నిలబెట్టుకున్నాడు. సమయంచూసి కృష్ణ ఉద్యోగం ఊడగొట్టాలని మేనేజరు కాచుకు కూర్చున్నట్లు కృష్ణకి తెలుసు. అందుకే 'తక్షకు'డంటూంటాడు ఆయన్ని. మొన్న తనుకంపెనీ స్టాటిస్టిక్స్ పరిచూస్తూండడంలో నిష్కారణంగా తనమీద తప్పు ఆరోపించి మేనేజరు గట్టిగా చీవాట్లుపెట్టి ఆఖరిసారి వార్నింగ్ యిచ్చాడు. ఇవాళ మూర్తి మేనేజరు చేసే ప్రయత్నాలను తనకు చెప్పినప్పుడు మొదట లెక్కచెయ్యలేదు.



బాతుల జంట

బాలలసంఘం సభ్యుడు పాటిబండ్ల లక్ష్మీనరసింహమూర్తి వేసిన చిత్రం. వయస్సు 14 ఏళ్లు. వినుకొండ బోర్డు హైస్కూలులో స్కూల్‌ఫైనల్ చదువుతున్నాడు.

కాని నిరుద్యోగిగా తన భవిష్యత్తుమాత్రం ఊహించలేక పోతున్నాడు. ఈ సంఘటన శారదకు చెప్పి ఆమెలో అసంతృప్తినీ, విచారాన్నీ కలిగించ దలుచుకోలేదు.

* * *

శారదతో హోరాహోరీ వాదించి, ఉపవాసం ఉంచకుండా భోజనంచేశాడు కృష్ణ. ఇంటిపనులన్నీ చూసుకుని శారద వచ్చేటప్పటికి బాగా పొద్దుపోయింది. శారదకు వైకుంఠపాళి అభిమాన పాత్రమైన ఏకైక క్రీడావిశేషం. ఎందుకంటే, ఆమెకు ఆ ఆట తప్ప వేరేఆటరాదు. (మిగతావి ఆడవాళ్ళు ఆడుకునే ఆటలే అన్నీ!) భర్తతో ఆడే అవ్వతఉన్న ఆట ఇదొక్కటే. కృష్ణఆమెకు పేకాటలోని రకాలన్నీ ఓపికగా బోధించాడు. చదరంగం నేర్పాడు. అతను నేర్పుతూంటే విన్న పక్కింటి శ్యామలగారు అతిచాకచక్యంతో భర్తతో ఆడుతోంది. కాని శారదకుమాత్రం ఈ విద్యలేమీ అబ్బలేదు. గురుముఖంగా ఈ విద్యలన్నీ అభ్యసించినా శారద ఉత్సాహం చూపకపోడం, ఏకలవ్య శిష్యత్వం చేసి (గోడవతలనుంచి విని) ఈ విద్యలన్నీ కరతలామలకం చేసుకున్న శ్యామలగారి చాకచక్యం పోల్చుకుని 'చాల అన్యాయం' అనుకున్నాడు కృష్ణ.

తప్పనిసరిగా కూర్చున్నా, అతనిలో పట్టుదలా, పౌరుషం అతన్ని ప్రోత్సహించాయి. వైకుంఠపాళి తనకు అచ్చివచ్చిన ఆట కాదని అతను ఓడిపోయినప్పుడల్లా (అసలు గెలిచిన దెప్పుడు?) ఆమెతో వాదిస్తాడు. ఇలాటి సందర్భాలలో, అతనికి మూఢ నమ్మకాలమీద నమ్మకం లేదని తీసిపారేసినవి అన్‌కాంషస్‌గా వ్యక్తమౌతూంటాయి. వైకుంఠపాళీ మీద అతనికి ఇంత ద్వేషం (సకారణమే అనుకోండి) ఒకపక్క మనస్సులో ఉవ్వెత్తుగా పొంగుతున్నా, మరోవైపు ఆ ఆటలో అబల చేతిలో తను ఎప్పుడూ ఓడిపోతూండడం అతన్ని క్రుంగదీస్తూంటుంది. ఆ ఆటమీద ఇంతటి ద్వేషం ప్రబలిపోవడానికి కారణమేమిటంటే, అతనెప్పుడు ఆటకు కూర్చున్నా (అదేమి పాపమో!) పెద్దపాము వాతపడడం, మళ్ళీ మొదటికే రావడం విషమచక్ర పరిభ్రమణం లాగ సంభవిస్తూనే ఉంటుంది. నిజ జీవితంలో కూడా ఈ పోలిక కనిపించి, కసికొద్దీ మేనేజరు గారికి 'తక్షక' రామారావుగారని నామకరణం చేశాడు. ఆట మొదటికి చేరుకున్న అతని బిక్కమొహాన్ని, విసుగునీ, కోపాన్నీ సహనాన్నీ చూసి శారద పమిట చెంగు నోటికి అడ్డుపెట్టుకొన్నా నవ్వు ఆగదు. తను నిచ్చెన ఎక్కి, గండాలన్నీ గడిచి, 'పరమపద సోపానా'న్ని ఎక్కి, ఎవరెస్ట్ శిఖరాగ్రాన్ని ఎక్కి విజయగర్వంతో ఫొటోకి పోజుపెట్టిన టెన్సింగ్ లాగ—విజయాన్ని సాధించడం కృష్ణచూసి పైకి కాకపోయినా లోలోపల అసూయ పడుతూంటాడు. ఇదీ మరి నవ్వు కలిగిస్తుంది. యుద్ధంలో ఓడిపోయిన నెపోలియన్‌లాగ, షేక్స్పియర్ మొహం వేళ్ళాడేసుకుని దారిలో గిరీశానికి తగిలే వెంకటేశంలాగ, అతను పరాజయ


పరాధీన భావాలతో. ఉక్రోషంతో, ఈర్ష్యతో. పట్టుదలతో—చివరికి సహనంతో బాధ పడుతూండడం చూసి శారద చాలా జాలిపడుతుంది. అతనికి సానుభూతి చూపడంకోసం, కావలసి ఆట పోగొట్టుకోడానికి, గవ్వలు గిలకరించి బోర్లా వేసి అప్పుడప్పుడు నిచ్చెనలు దిగిపోయి ఆటలో కూడా అపజయాన్ని స్వీకరిస్తూంటుంది అతనితో పాటు. ఈ త్యాగానికి అతనిలో కొంత సంతృప్తి కనిపిస్తుంది.

శారద వైకుంఠపాళి తియ్యగానే కృష్ణ ఉలిక్కిపడ్డాడు. ఉన్నట్టుండి, పీడ కలతో మెలుకువ వచ్చినవాడిలాగ "తిక్కుడు' అని భయంతో కేక వేశాడు. కృష్ణ కర్తవ్య పరాఙ్ముఖుడు మాత్రం కాడు, ఎలాగయినా, యీసారి అయినా. ఆమెను ఓడించాలనే పట్టుదలతో అతను 'కృతనిశ్చయుడై' కూర్చున్నాడు (బహుశా తిక్క రమారావుగారి మీద కోపం పరోక్షంగా యీ పట్టుదలకి కారణమై వుంటుంది.) కాని- యీ ఉత్సాహం కాస్తా శారద పలికిన నాందీ ప్రవచనంతో చల్లారిపోయింది.

"ఈసారి అయినా మీ మేనేజరుగారి బాగా పనికండి." అంది తల వంచుకుని. ఆమె తల వంచుకుని మాట అన్నా, నవ్వుతోందని ఆమె గొంతు సాక్ష్యం ఇస్తోంది.

మేనేజరుని తిక్కుడితో (ఆటలోని పెద్ద పాముతో) అభేదాధ్యవసాయం చేసి రూపకాలంకారం మాట్లాడడం కృష్ణకి సుతరామూ నచ్చలేదు. తనకి మేనేజరు మీద ఉన్న కోపం ఆమె రిమార్కుతో జ్ఞాపకము వచ్చింది.

"ఈ దెబ్బతో తిక్కుడి అంతు తేలి




పోవాలి" అని మేనేజరును ప్రత్యేకంగా మనస్సులో అనుకుంటూ గవ్వలు విసిరి వేశాడు పౌరుషంతో.

చిన్నపిల్లాడి ప్రతిజ్ఞలాంటి ఈ ప్రతిజ్ఞకి శారద నవ్వుకుంది.

శారద గవ్వలు విసిరే నేర్పూ, ఆమె చేతివేళ్లు ఎలాగ పెట్టి గవ్వల్ని విసురుతోందో ఆకిటుకూ, ఆమె ఆటలోని కీలకం ఆమె చూడకుండా ఉన్నప్పుడు ఓరగా చూస్తూ అలాగే ఆమె నేర్పుని అనుకరించాలని ప్రయత్నించాడు. కాని ఎంత శ్రమపడ్డా అతనికి తిక్కుడి గండం గడవడం మాత్రం దుర్లభమైంది. అతను మళ్లీ మళ్ళీ ఆట మొదటికి రావడం ఎక్కువయేకొద్దీ శారద నవ్వుకూడా ఎక్కువౌతోంది. ఆమె వైపు కోపంగా చూసే తన ఉడుకుబోతుతనాన్ని ఆమె అవలీలగా పసిగట్టేస్తుందని అతనికి తెలుసు. అందుకే, ఈ ఆట అంటే తనకేమీ లక్ష్యం లేనట్లు ఉంటున్నాడు. ఆమె ఎప్పుడో 'పరమపద సోపానాన్ని' చేరుకుంది. తన పనేమీ లేదట. ఆమె తన చోటులోనే పడుకుని అతని ఆటనిచూస్తోంది. 'రన్నింగ్ రేస్'లో తనకింక బహుమతి రాదని స్పష్టంగా తెలిసిపోయినా ఆఖరువరకూ ఓర్పుతో పందెంలో పరుగెత్తే చిట్టచివరి అభాగ్యుడ్ని ప్రేక్షకులు సానుభూతిగా చూసినట్లు చూస్తోందని ఆమె చూపుకి వ్యాఖ్యానం చేసుకున్నాక అతనికి చాలా నిరుత్సాహం కలిగింది. ఇంక తనకీ ఆట ఎలాగూ అబ్బదనీ ఆ ఆటలోని విజయం శాశ్వతంగా శారదదేనని హక్కు పత్రం వ్రాసి ఇచ్చినవాడిలాగ, గవ్వలు విసిరేసి, నిశ్చింతగా గోడకు జార్లబడ్డాడు. ఆట 'కళ'లో తను కృతకృత్యుడు కాలేకపోయినందుకు తన అసమర్థతమీద తనకు అసహ్యం వేసింది. నిజమైన తిక్కుడి (మేనేజరు) దగ్గరకూడా పరాజయమే వ్రాసిపెట్టి ఉందేమోననే విచారం అతన్ని బాధించింది. ఆ బాధతో మనస్సు చికాకై మిగతా రాత్రంతా ఎలాగో వెళ్ళబుచ్చాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ కృష్ణకి మేనేజరు మీద అనుమానం, ఈ అనుమానంతో అశాంతీ ఎక్కువౌతున్నాయి. మేనేజరు తిక్కుడు ఇంతవరకూ పైకి ఏమీ తేలకపోవడమే, ఈ అనుమానాన్ని మరీ దృఢపరచింది కృష్ణలో. తను ఇలాగ బాధపడుతున్నట్లు శారదకు తెలియనివ్వకుండా, జాగ్రత్తగా నటించడంలోనే అతనికి కష్టమనిపిస్తోంది.

ఆరోజు సాయంత్రం: ఆఫీసునుంచి సరాసరి ఇంటికి వచ్చిన కృష్ణని చూసి శారద ఆశ్చర్యపడింది. కాళ్లు కడుక్కుని, కాఫీ త్రాగుతున్న ధోరణి చూసి అతనిలో ఏదో ఒక మార్పుని గ్రహించింది. ఆమె 'సస్పెన్స్'తో తికమకపడి ఆఖరికి పరాజయాన్ని అంగీకరించేదాకా తను అసలు సంగతి ఆమెకు తెలియనివ్వకూడదని మరోసారి జ్ఞాపకం తెచ్చుకున్నాడు. కాని ఆమె అతను ఊహించినంత సులభంగా లొంగలేదు. అతని ఘనకార్యం మీద తనకు ఏ మాత్రం శ్రద్ధలేనట్టే ఉండడంచూసి తప్పనిసరిగా రాజీపడ్డాడు తిరిగి తను.

"శారూ. ఒక శుభవార్త చెబుతాను. కాని ఒక్క షరతు. మనస్సులోని దాన్ని గ్రహించి నువ్వే చెప్పుకోవాలి" అన్నాడు.

ఇలాటి పరీక్ష అంటే ఆమెకు ఇష్టం ఉండదు. గబగబ జాబితా ఏకరువు పెట్టింది.

"మీ మేనేజరుగారికి సుపుత్రోదయం అయింది" అని నవ్వింది.

అతను కోపంగా "మేనేజరుకి సంతానం కలిగితే మాకేం శుభం?" అన్నాడు.

కొంటెగా చూస్తూ, "ఒక రోజు సెలవు ఇచ్చారు" అంది. చివరికి తప్పని సరిగా తనే చెప్పాలిసి వచ్చింది.

"రోజూ ఆఫీసుకి వెడుతున్నప్పుడూ—ప్రతిసారీ ప్రియురాలి చేతిలో వైకుంఠపాళిలో ఓడిపోయినప్పుడూ—ఒకానొక బొమ్మ తిక్కుణ్ణే గెలవలేని నేను వాస్తవిక జీవితంలోని మేనేజరు 'తిక్కుడి' గండం ఎలా గడవగలననే ఒక దురభిప్రాయం—సహేతుకమైనది కాదనుకో—మనస్సులో నిలిచిపోయింది. కాని ఒక శుభ సమయాన ఒకానొక లంచం కేసులో మా మేనేజరు 'తిక్కుడు' డిస్మిస్ అయి, శ్రీకృష్ణజన్మస్థానం అలంకరించబోతున్నాడనీ, ఇక మీదట 'మేం' ఆ సింహాసనాన్ని అలంకరించబోతున్నామనిమహారాణీ శారదాదేవిగారు చిత్తగించవలెను" అన్నాడు సాభినయంగా.

అతను ఇచ్చిన చిన్న లెక్చరుకి ఆమె నవ్వకుండా ఉండలేకపోయింది.

"పోనీ లెండి మీ కోసం ఇక మీదట నుంచీ ఈ ఆట మానేస్తాను" అంది. అతను ఇంత కాలం తన బలవంతంవల్ల వైకుంఠపాళిలో పొందిన పరాజయావమానాన్ని గురించి ఆలోచిస్తూ—పశ్చాత్తాపంగా.

డాబా మీద—పాలసముద్రంలాగా, మల్లెపూవుల పాన్పు పరిచినట్లూ—హిమానీనదం ప్రవహిస్తున్నటూ తళ తళ లాడిపోతూన్న వెన్నెలలోకి చూస్తూ అతను ఆమెను చూసి, "శారద రాత్రులుజ్జ్వల లసత్తర తారక హారపంక్తులన్" అనే పద్యాన్ని మంద్రస్వరంతో రాగయుక్తంగా చదివాడు.

తర్కాలకూ, మీమాంసలకూ, వ్యాఖ్యానాలకు లొంగని లోతులలోనుంచి వెలువడే అనురాగంతో ఆమె అతన్ని చూసి—దరహాసం చేసింది. అతను ఆమెను సంతృప్తిగా దగ్గరకు తీసుకున్నాడు. ★